


డిఇఒగా పురుషోత్తం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా విద్యాశాఖ అధికారిగా టి.పురుషోత్తం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి వి.రాఘవరెడ్డి కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పురుషోత్తం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ తాను అమరావతిలో కమిషనర్ ఆఫీస్ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యానని పేర్కొన్నారు. గతంలో చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేసినట్లు తెలిపారు. జిల్లాలో విద్యా రంగాన్ని మెరుగుపరిచి, రాబోయే 10 తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిఇఒను పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఇఒ పురుషోత్తం

అకాల వర్షం.. రైతులకు తీవ్ర నష్టం

- 80 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- ఈదురు గాలులకు నేలకొరిగిన టమోటా, మామిడి
- నిద్రమత్తులో అధికారులు, ఆర్‌బికె సిబ్బంది
- లబోదిబోమంటున్న రైతులు



నిమ్మనపల్లె : రాచవేటివారిపల్లిలో నేలకొరిగిన మామిడి చెట్లు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గాలి వాన బీభత్సానికి జిల్లాలోని పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. తీవ్ర గాలులు, వడగళ్లతో కూడిన అకాల వర్షం ప్రభావంతో ఉద్యానవన పంటలు దెబ్బ తినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల సాగు చేసిన మామిడి, టమోటా, బొప్పాయి తోటలు గాలుల ప్రభావానికి విరిగి, నేలవాలి రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. రాత్రి వేళలో తీవ్ర గాలుల ప్రభావంతో కురిసిన వడగళ్లతో కూడిన అకాల వర్షానికి, మండల వ్యాప్తంగా 80 ఎకరాలకి పైగా ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. 66 ఎకరాల్లో టమోటా, ఆరు ఎకరాల్లో బొప్పాయి, మామిడి మూడు, మిరప రెండు, బెండ మూడు ఎకరాలలో వడగళ్ల వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నాయి. పూత దశలోని టమోటా, పూత, పిందె దశలోని మామిడి చెట్లు గాలుల ప్రభావానికి పూర్తిగా విరిగిపడ్డాయి. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఉద్యానవన శాఖాధికారులు, రైతు భరోసా కేంద్రంలోని సిబ్బంది అకాల వర్ష ప్రభావంతో దెబ్బతిన్న పంటలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నట్లు మండల ఉద్యానవన శాఖాధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి పూర్తి నివేదికను ప్రభుత్వం దృష్టికి పంపుతామన్నారు.



వాల్మీకిపురం : గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయామని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో రైతులు పండించిన టమోటా, బొప్పాయి, మిరప తదితర పంటలు దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 40 ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు రైతుల అంచనా. పంట నష్టాలను అంచనా వేయాల్సిన అధికారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది నిద్రమత్తులో జోగుతుండడంతో రైతులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్యారంపల్లి, ఫత్తేపురం, ఓబులంపల్లి, జర్రావారిపల్లి తదితర ప్రాంతాల్లో రైతులకు పంట నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు నాగార్జున, మహేష్ రెడ్డి, రామక్రిష్ణ, శ్రీనివాసులు రెడ్డి, నరసింహులు, వెంకట్రమణ రెడ్డి, సురేంద్ర రెడ్డి, వెంకట్రమణ, ఆనంద రెడ్డి తదితరులు కోరారు. అలాగే విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడడంతో ప్యారంపల్లి, శివపురం, ఓబులంపల్లి, నల్లంవాండ్లపల్లి గ్రామాల్లో గురువారం సాయంత్రం 6గంటల నుంచి విద్యుత్ లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్‌శాఖ ఏఈ జాకీర్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ పనులు చేపట్టారు.



వాల్మీకిపురం : నష్టం వాటిల్లిన టమోటా పంటను చూపుతున్న రైతు

ఉచితంగా డ్రిప్ పరికరాలు అందించాలి

- అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే చింతల

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మెట్ట ప్రాంతంలో ఉండే రైతులకు ఉచితంగా డ్రిప్ పరికరాలు అందిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో టమోటా, వరి, కూరగాయలను ఎక్కువ మంది రైతులు బోరు బావులు పైన ఆధారపడి పండిస్తున్నారని, రైతులకు డ్రిప్పు అనేది గొప్ప వరప్రదాయమన్నారు. ఈ సంవత్సరం సూక్ష్మ సేద్యానికి వ్యవసాయ శాఖ మంత్రి ఎంత కేటాయించారు, సన్నకారు, చిన్న కారు, మధ్య తరగతి రైతులకు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల

ఎటువంటి నిభంధనలు లేకుండా ఐదు ఎకరాల లోపు వున్న రైతులకు వంద శాతం రాయితీ ఇచ్చే ప్రతిపాదన వున్నదా లేదా, అలాగే తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కరుపు పరిస్థితులు వున్న సమయంలో రెయిన్ గన్స్, స్ప్రింకర్లు, డ్రిప్ పరికరాలు మరికొంత మందికి వ్యవసాయ పరికరాలను తాత్కాలికంగా వాడుకోమని ఇచ్చారని, కానీ ఇప్పటికీ కూడా అవి అన్నీ తెలుగు దేశం పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్లలోనే ఉన్నాయన్నారు. వాటిని స్వాధీన పరుచుకోవడానికి వ్యవసాయ అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వం స్పందించి వాటిని వెంటనే స్వాధీనపరుచుకోవాలని, అన్నమయ్య జిల్లాలో ఎక్కువ శాతం కరువు ఉన్న పరిస్థితుల్లో రైతులు డ్రిప్ పరికరాలు, స్ప్రింకర్లు, రెయిన్‌గన్లకు దరఖాస్తు చేసుకున్నప్పుడు ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన రైతులకు అందించాలన్నారు. మెట్ట ప్రాంతాలలో ఉన్న రైతులకు, ఐదు ఎకరాల లోపల ఉన్న సన్నకారు రైతులకు డ్రిప్ పరికరాలను వందశాతం రాయితీతో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- రాష్ట్రంలో సైకో పాలన నడుస్తోంది
- ఎమ్మెల్సీల గెలుపుతో వైసిపికి రోజులు దగ్గరపడ్డాయి
- పాదయాత్రలో నారా లోకేష్



బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-ములకలచెరువు

వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగి వేసారి పోతున్న రాష్ట్ర ప్రజలు ప్రభుత్వంపై పూర్తిస్థాయిలో వ్యతిరేకత చూపుతున్నారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సైకోలా వ్యవహరిస్తున్నారని, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుతోనే వైసిపికి రోజులు దగ్గరపడ్డాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 45వ రోజుకు చేరుకుంది. శుక్రవారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలం నుంచి మొలకలచెరువు మండలంలోని కమ్మపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర పులికల్లు, ములకలచెరువు వరకూ పాదయాత్ర సాగుగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులతో మాటామంతి నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం నింపేందుకే కుప్పం నియోజకవర్గంలో పాదయాత్ర మొదలుపెట్టి అన్ని నియోజకవర్గాలలో పర్యటిస్తూ నాలుగువేల కిలోమీటర్లు యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పీఠం కోసం ప్రజలకు ఎన్నో అబద్ధపు వాగ్దానాలు చేసిన జగన్మోహన్ రెడ్డి, ముఖ్యమంత్రి అయ్యాక వాటిని పక్కన పెట్టి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, రాష్ట్రంలో తాళిబన్‌ల పరిపాలన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి అయిన వారం రోజుల్లోనే ప్రభుత్వ ఉద్యోగుల సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా వాటి గురించి పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం నిషేధం అమలు చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చి రాష్ట్రంలో ఎక్కడ చూసినా కల్తీ మద్యాన్ని అమ్ముతూ సొమ్ము చేసుకుం టున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ లకు ఉన్న కార్పొరేషన్లు పూర్తిగా తొలగించి వారికి అన్యాయం చేయడం జరిగిందన్నారు. 45 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ నిరుపేదలకు పింఛన్ సరఫరా చేస్తానని హామీ ఇచ్చి ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. ఉన్న పాఠశాలలను కూడా మూసివేస్తూ, విదేశీ విద్య కూడా రద్దు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. ఎన్నికల ముందు రైతులు పండించిన పంటలను ప్రభుత్వం గిట్టుబాటు ధరలో కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చి, వాటిని కొనుగోలు చేసే పనులు పక్కనపెట్టి రైతుల బోర్లకు మీటర్లు బిగించే పనులు చేస్తూ రైతులను ఇబ్బందులు పాలు చేస్తున్నట్టు తెలిపారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకునే జగన్మోహన్‌రెడ్డి హంద్రీ-నీవా, గాలేరు కాలువ పనులను ఇంతవరకు పూర్తి చేయలేక ప్రజలను ఇబ్బందులు పాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తానని, ఎందుకు సంబంధించి ప్రతి సంవత్సరం ఉద్యోగాల క్యాలెండర్ ను విడుదల చేస్తానని రాష్ట్రంలోని నిరుద్యోగులను నమ్మించి, నాలుగు సంవత్సరాలు అయినా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఉన్న పరిశ్రమలను పక్క రాష్ట్రాలకు తరిమికొడుతూ రాష్ట్రంలో మరింత నిరుద్యోగత పెంచుతూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై ప్రశ్నించిన వారిపై పోలీసుల ద్వారా కేసులు పెట్టడం, గుండాల ద్వారా దాడులు చేయడం, భూ కబ్జాలు, ఇసుక దందాలు పెట్రేగిపోయాయన్నారు. ప్రజల ధనాన్ని దోచుకుంటూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్లారన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో కురబలకోట, అంగళ్లు ప్రాంతంలో పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములు వందల ఎకరాలు, వేలకోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వం భూములను ఆక్రమించుకున్నారన్నారు. తంబళ్లపల్లి మల్లయ్య కొండ దేవాలయంలో ఉన్న మూల విగ్రహాన్ని ఏం చేశారు, అది ఎక్కడుంది అని ప్రశ్నించారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో శాసనసభ్యులుగా గెలిపిస్తే, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి, నియోజకవర్గంలో ఉన్న సంపదను దోచుకుంటున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అన్యాయాలపై తిరుగుబాటు చేసిన తంబళ్లపల్లి మండలం వైకాపా పార్టీ జడ్పిటిసి భర్త కొండ్రెడ్డిని జిల్లా బహిష్కరణకు గురి చేశారన్నారు. అన్ని హంగులున్న మదనపల్లి ని జిల్లా కేంద్రంగా ప్రకటించాల్సి ఉండగా పెద్దిరెడ్డి కుటుంబం స్వలాభం కోసం, మారుమూలున్న రాయచోటిని జిల్లా కేంద్రంలోకి మళ్లించారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లా కేంద్రంగా చేస్తామని హామీ ఇచ్చారు. పాలు విసిరిన సవాల్ పై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు సిద్ధమేనన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీనీవా పనులు పూర్తి చేస్తామని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, మదనపల్లి టమోటా మార్కెట్ను దత్తత తీసుకొని, మార్కెట్ను అభివృద్ధి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలను తీసుకొచ్చి నిరుద్యోగతనం తగ్గించేందుకు కృషి చేస్తానన్నారు. అరాచక పాలన సాగిస్తున్న వైకాపా పార్టీని గద్దదించాలని ప్రజలను కోరారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు రాబోయే రోజుల్లో పార్టీ గెలుపు కోసం, భయపడకుండా శ్రమించి పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం ములకలచెరువు నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చీకటిమానపల్లి మీదుగా పాదయాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్, టిడిపి పార్టీ నాయకులు గంటా నరహరి, కొల్లు రవీంద్ర, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు గుత్తికొండ త్యాగరాజు, రాష్ట్ర తెలుగు మహిళా నాయకులు పర్వీన్‌తాజ్, జడ్పిటిసి కువైట్ శంకర్, మండల అధ్యక్షులు సిద్ధప్ప, ఉపాధ్యక్షులు వెంకటస్వామి, కెవి రమణ, మౌలా, భజంత్రీ రామానుజులు, కేశవులు, చిన్న కృష్ణ, కట్టహరి, నరసింహారెడ్డి, సుబ్బి నాయుడు, విజయ్ కుమార్, రెడ్డప్ప, శ్రీనివాసులు, సోము, గంగాదేవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రామచంద్రారెడ్డి

- ఉత్కంఠ పోరులో స్వల్ప మెజార్టీతో గెలుపు
- ధ్రువీకరణ పత్రం అందజేసిన అనంత కలెక్టర్
- పట్టభద్ర ఓట్ల లెక్కింపులో హోరాహోరీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎం.వి.రామచంద్రారెడ్డి గెలుపొందారు. రెండ్రోజులుగా అనంతపురం జెఎన్‌టియులో చేపట్టిన కౌంటింగ్‌లో తన సమీప ప్రత్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి నుంచి ఎదురైన ఉత్కంఠ భరిత పోరులో 169 ఓట్ల స్వల్ప మెజార్టీతో బయటపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు నిలిచిన సంగతి తెలిసిందే. వీరిలో ఎం.వి.రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కత్తి నరసింహారెడ్డి మధ్య హోరాహోరీగా పోరు నడిచింది. వీరిలో ఎవరికీ 50 శాతం ఓట్లు లభించని నేపథ్యంలో ద్వితీయ ప్రాధాన్య ఓటును పరిగణలోకి తీసుకుని లెక్కించాల్సి వచ్చింది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 25,272 ఓట్లు పోలు కాగా, 3,867 చెల్లని ఓట్లుగా తేలినట్లు సమాచారం. 21,405 ఓట్లలో అధికార వైసిపి మద్దతుదారు ఎం.వి.రామచంద్రారెడ్డికి 10,787 ఓట్లు, ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి 10,618 ఓట్లు లభించాయి. 169 స్వల్పఓట్ల మెజార్టీతో అధికార వైసిపి మద్దతుదారు ఎం.వి.రామచంద్రారెడ్డి గెలు పొందినట్లు ప్రకటించారు. అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మీ ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల దగ్గర నుంచి ఎన్నికల ప్రచారం, కౌంటింగ్ దశల వరకు ప్రత్యర్థుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పరిశీలన, ఉపసంహరణ దశల అనంతరం హోరాహోరీగా తలపడాల్సి వచ్చి మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అనిల్‌రెడ్డి తదితరుల నుంచి అనివార్యమైన పోరు ఎదురైంది. కౌంటింగ్ దశలో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనూ ఆధిక్యం చేతులు మారుతూ రావడం ఊపిరి బిగబట్టుకుని గెలుపు కోసం నిరీక్షించాల్సి వచ్చింది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ పది రౌండ్ల లెక్కింపులో భాగంగా ఇప్పటి వరకు లెక్కించిన ఆరు రౌండ్ల ఓట్ల లెక్కింపులోనూ అధికార వైసిపి మద్దతుదారు వెన్నపూస రవీంద్రారెడ్డి, టిడిపి మద్దతుదారు రామ్‌గోపాల్‌రెడ్డి మధ్య మెజార్టీ ఆధిక్యం చేతులు మారుతూ ఉండడం ఉత్కంఠను కలిగిస్తోంది. మిగిలిన మూడు రౌండ్ల ఎవరిని విజయలక్ష్మీ వరించనున్నదోననే ఉత్కంఠ నెలకొంది.



రామచంద్రారెడ్డికి ధ్రువపత్రం అందజేస్తున్న అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మి

తెలుగువారు గర్వించదగ్గ రచయిత్రి మొల్ల

- వైవీయూ విసి ఆచార్య జింక రంగ జనార్ధన్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఏడు వందల ఏళ్ల కిందటే రామాయణాన్ని తెలుగు వారందరికి అర్థమయ్యేలా రచించిన కవయిత్రి మొల్ల మన జిల్లా వాసి కావడం మనందరికీ గర్వకారణమని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య రంగ జనార్ధన్ అన్నారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం, మొల్ల సాహితీపీఠం సంయుక్త ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల సప్తశత జయంతి సభ ఆర్ట్స్ బ్లాక్ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ ఎన్.ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా విసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవయిత్రి మొల్ల రచించిన రామాయణం సుకుమార సరళ రచనగా అభివర్ణించారు. ప్రతి ఏటా మొల్ల జయంతిని విశ్వవిద్యాలయం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించారు. మొల్ల రచనలు సాహిత్యం గురించి తెలుసుకోవడంతో పాటు ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన కుల సచివులు ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మొల్ల జయంతికి నిధులు ఇచ్చే అధికారికంగా నిర్వహించారని తెలిపారు. సహజంగా ఇతిహాసాలలో భక్తి, కారుణ్య రసం కనిపిస్తుందని, మొల్ల రామాయణంలో నవరసాలు కనిపిస్తాయని తెలిపారు. 24 వేల శ్లోకాల రామాయణం 845 కంద పద్యాలతో వర్ణించిన తీరు అద్భుతం అన్నారు. మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపకులు గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం కవయిత్రి మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించ తలపెట్టడం పట్ల వైవీయూ విసికి, రిజిస్ట్రార్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. మొల్ల పేరుతో ఒక సమావేశ మందిరం ప్రారంభించడం ముదావహమన్నారు. కవయిత్రి మొల్ల పేరును నిత్యం గుర్తుంచుకునేలా యోగి వేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బ్లాక్‌లో సమావేశ మందిరాన్ని విసి రంగ జనార్ధన్, కుల సచివులు ఆచార్య వైపి వెంకటసుబ్బయ్యతో కలిసి ప్రారంభించారు. సమావేశంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ విసి రంగ జనార్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బడ్జెట్‌లో ఉపాధి ఊసే లేదు

- సిపిఎం కడప జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో బడ్జెట్‌లో ఉపాధి ఊసే లేదని, వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేశారని, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌కు ముందు ముఖ్యమంత్రి ఈ బడ్జెట్ సమ్మిళిత, సుస్థిరత, సుపరిపాలన బడ్జెట్‌గా పెట్టబోతున్నట్లు మాటల గారడీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఈ బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంతాల్లో జీవించే 62 శాతం ప్రజలను విస్మరించిందని చెప్పారు. ఉపాధి, వ్యవసాయం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ప్రాజెక్టులు, చెరువులు, పంట కాలవలు, పాడి పరిశ్రమ లాంటి ఉత్పాదకరంగాన్ని, ఉపాధి రంగాన్ని పూర్తిగా నిధులు కేటాయించకుండా ఈ బడ్జెట్ విస్మరించిందని తెలిపారు. ఉత్పాదకరంగానికి కేవలం రూ.30 వేల కోట్లు మాత్రమే బడ్జెట్లో చూపించారని, గత బడ్జెట్‌లోనూ రూ.32 వేల కోట్లు చూపించి రూ.16 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి, మిగతా డబ్బు నగదు బదిలీ అవసరాలకు ప్రభుత్వం వాడుకుందని తెలిపారు. అందుకే రాష్ట్రంలో 'జాబ్ క్యాలెండర్' విడుదల చేయలేక పోయారని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచలేకపోయారని గుర్తు చేశారు. ఈ బడ్జెట్ కూడా రాష్ట్రంలో కొత్త ఉపాధి అవకాశాలు కల్పించ లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు దౌర్జన్యం బోగస్ ఓట్లు ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలను నిర్మూలించే బిజెపి ఎత్తుగడను వైసిపి అనుసరిస్తుందని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్. సుబ్బమ్మ, బి.మనోహర్, ఎ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులురెడ్డి, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

ఎంజెఆర్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల ప్రాంగణ ఎంపిక జరిగిందని కళాశాల చైర్మన్ ఎంపి. అవినాష్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎపిటి ఆన్‌లైన్ లిమిటెడ్ ఎటిసిఎస్ జాయింట్ వెంచర్ కంపెనీ ఆధ్వర్యంలో కె.సత్య, రవి, హెచ్‌ఆర్ రెండు దశల్లో విద్యార్థులను పరీక్షించారన్నారు. మొదటి రౌండ్ వ్రాత పరీక్షకు 104 మంది విద్యార్థులు హాజరు కాగా, రెండవ దశ టెక్నికల్ రెండులో 18 మంది ఎంపిక కయ్యారని, ఫైనల్లో 9మంది విద్యార్థులు ఎంపిక అయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.3 లక్షల జీతంతో ప్యాకేజీ పొందుతారని కంపెనీ హెచ్‌ఆర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ అవినాష్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమాలు ప్లేస్ మెంట్ ఇన్‌ఛార్జి రెడ్డిఖాసీమ్, కె.సురేష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కంపెనీల హెచ్‌ఆర్‌లు, కళాశాల యాజమాన్యం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఐఇఒ కృష్ణయ్య

ఇంటర్ పరీక్షకు 549 మంది గైర్హాజర్

ప్రజాశక్తి-రాయచోటి

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పేపర్-1 పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 14,085 మంది విద్యార్థులకు గాను 13,535 మంది పరీక్ష రాశారన్నారు. రాయచోటిలో ఒకరు మాల్ ప్రాక్టీస్ చేస్తుండగా డీబార్ చేశామన్నారు. పరీక్షకు 549 మంది గైర్హాజరయ్యారన్నారు. ఇంటర్ పరీక్షలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్‌కు 08561 293006 ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ రక్తదాన శిబిరంలో 117 యూనిట్ల రక్తం సేకరించారు. యువతి, యువకులు స్వచ్ఛందంగా ముందు కొచ్చి రక్తదానం చేశారు. ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ రామలింగారెడ్డి అధ్యక్షతన యువత రక్తదానం చేయడానికి ఆసక్తి కనబరిచారు. ఇక్కడ సేకరించిన రక్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లోనూ ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న రోగులకు అందించి వారిని కాపాడడానికి వినియోగించడం జరుగుతుందని జిల్లా ఆసుపత్రి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ అమరావతి స్పష్టం చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో వైద్య సేవలు అందుకుంటున్న వారికి నూతన జీవితాన్ని ప్రసాదించడం రక్తదాతల వల్లనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ, వారిని సన్మార్గంలో నడిపించడం తమ కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ బాబులాల్, లియో బషీర్, కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు


తాగునీటిని విడుదల చేస్తున్న స్థానిక నాయకులు

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ పెద్ద మాదిగపల్లె ప్రజలు తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేక గత కొనేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచు నాగులమ్మ, ఆమె కుమారుడు రవి, డీలర్ మల్లికార్జులను ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి దృష్టికి తీసుకపోయారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ అధికారులకు చరవాణి ద్వారా మాట్లాడి వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కోరారు. అనంతరం రెండు రోజుల్లో విద్యుత్ కనెక్షన్ ఇచ్చి శుక్రవారం సర్పంచ్ తనయుడు రవి స్విచ్ ఆన్ చేసి తాగునీటిని వదిలారు. ప్రజలకు దాహతి తీర్చిన సర్పంచ్, ఎమ్మెల్యే మేడ మల్లికార్జున్‌రెడ్డి ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తనయుడు రవి మాట్లాడుతూ వేసవిలో పెద్ద మాదిగపల్లె ప్రజల నీటి కష్టాలను చూసి ఎమ్మెల్యే తన నిధుల నుంచి బోర్ వేయించి నీటి వసతిని కల్పించారని తెలిపారు. ప్రజల అభివృద్ధిని జగన్ ప్రభుత్వం కోరుకుంటుందని, వైసిపితోనే ప్రజా సమస్యలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రామచంద్ర, రమణయ్య, వీరనాగయ్య, శ్రీనివాసులు, నాగేంద్ర, శంకర పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యా రంగానికి అన్యాయం

ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్ర బడ్జెట్ 2022-23 సంవత్సరాలుగాను విద్యారంగానికి గత సంవత్సరం కన్నా తక్కువ నిధులు కేటాయించడం అన్యాయమని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు పెద్దపీట వేస్తానని విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర ఓట్లు దండుకొని నేడు విద్యను సర్వనాశనం చేస్తున్నారని అన్నారు. బడ్జెట్లో విద్యారంగానికి 10.6శాతం నిధులు కేటాయించిందని, గత సంవత్సరంతో పోల్చితే 0.2 శాతం తక్కువ నిధులు కేటాయించడం సరికాదన్నారు. జగనన్న విద్యాకానుకకు రూ.560 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. విద్యారంగానికి బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని, విద్యారంగాన్ని ప్రభుత్వమే నిర్వహించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో నరేష్, రాము పాల్గొన్నారు. **కలికిరి :** విద్యారంగానికి మరిన్నీ నిధులు కేటాయించాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేనికుమార్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే డిఎస్సిని ప్రకటించి ఖాళీలను భర్తీ చేయాలన్నారు.

వర్షపు నీటితో జలమయమైన రోడ్లు

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలో గత రాత్రి కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమై పోయాయి. మురుగు కాలువల్లోని నీరు రోడ్లపై చేరి దుర్గంధం వెదజల్లింది. రోడ్లన్నీ బురదమయమై పోయాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బస్టాండ్ లోని పెద్దూరు రోడ్డుకి వెళ్లే దారి నీటితో నిండి చెరువును తలపించింది. దారులన్నీ బురదతో నిండిపోయాయి. అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న బురదను, మురుగు కాలువలను శుభ్రం చేయించాలని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఐటిఐలో అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని శ్రీ టిఎన్‌విఎస్ఆర్ఎం ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 20న ప్రధానమంత్రి అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శేషారెడ్డి తెలిపారు. ఈ అప్రెంటిస్ మేళాకు శ్రీసిటి, కాళహస్తిలోని వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని పేర్కొన్నారు. ఐటిఐ పూర్తి చేసుకున్న విద్యార్థి అందరూ ఈ అప్రంటీస్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తంబళ్లపల్లె ఐటిఐ ప్రాంగణంలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9494080339 నంబరును సంప్రదించాలన్నారు.


టిబి రోగులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న వైద్యులు

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి-కలకడ

క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు ఎర్రకోటపల్లి వైద్యాధికారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వార ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ పోషణ మిత్ర కార్యక్రమంలో భాగంగా, మెడికల్ ఆఫీసర్ కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టిబి రోగులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు.రోగులు క్రమం తప్పకుండా డాక్టర్ల పర్యవేక్షణలో వారు సూచించిన మేరకు చికిత్సలు పొందాలన్నారు. ఒక్కొక్క టిబి వ్యాధిగ్రస్తుడికి సుమారు రూ.700 పైచిలుకు విలువగల పౌష్టికాహార వస్తువులను అందించడం అభినందనీయమని అన్నారు. ఈ పౌష్టికాహారంతో పాటు మందులను కూడా క్రమం తప్పకుండా తీసుకున్నట్లయితే ఆరు నెలలకే క్షయ వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని అన్నారు. వైద్యులు కిషోర్ కుమార్ రెడ్డి, జవహర్ బాబు పంచాయితీ ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రజలకు క్షయవ్యాధి లక్షణాలను, వాటికి తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, ఎంపిహెచ్ఎస్ ముజీబ్ బాషా, బి.రెడ్డమ్మ, టిబి యూనిట్ వైద్య సిబ్బంది ఎంపిహెచ్ఎస్ మురళి, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ వై నాగిరెడ్డి, స్టాఫ్ నర్స్ భారతి, ల్యాబ్ టెక్షన్ జమీల, అహమ్మద్ ఆరోగ్య కార్యకర్త వాణి, ఎం ఎల్ హెచ్ఎస్ శ్వని, గోపికృష్ణ, కనకమ్మ రాజసులోచన, లావణ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదయాత్రపై ఎంఆర్‌పిఎస్ సమావేశం

ప్రజాశక్తి తంబళ్లపల్లి

ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణకు మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం మాదిగల మహాజన రెండవ సంగ్రామ పాదయాత్ర పెద్దమండెం మండలం వెలిగల్లు నుంచి ప్రారంభ మవుతుందని ఎంఆర్‌పిఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పాదయాత్రపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ తంబాలపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి దుమ్ము చిన్న, కో-కన్వీనర్ వెంకటప్ప, మండల కన్వీనర్ మల్లికార్జున, కురబలకోట మండల కన్వీనర్ రమణ, కోకన్వీనర్ తలారికుమార్, మహిళా నాయకులు జయమ్మ, బి.కొత్తకోట మండలం ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ ఆర్యే రఘు, శంకర, ఎంఎస్‌పి నాయకులు బొజ్జప్ప, రమణ, శంకర పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

చిన్నారులు, వృద్ధులకు దంత పరీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నేషనల్ ఓరల్ హెల్త్ సందర్భంగా పట్టణంలోని అమ్మచెరువుమిట్టలో వెలుగు సంస్థలో చిన్నారులకు, వృద్ధులకు జిల్లా ఆస్పత్రి దంత వైద్యులు అఫ్షాన్‌బేగం, బి.కొత్తకోట పిహెచ్‌సి దంత వైద్యులు దుర్గాదేవి ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక పాఠశాల తరగతి గదులను, బోధన పద్ధతులను, ఒకేషనల్ నందు హ్యాండ్ ఎంబ్రాయిడరీ, టైలరింగ్, అగర్ బత్తి, కంప్యూటర్‌లో దివ్యాంగులు ప్రతిభను చూసి ప్రశంసించారు. ప్రిన్సిపల్ పి.లీనాకుమారి వెలుగు కార్యకలాపాలు గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20న నేషనల్ ఓరల్ హెల్త్‌డే సందర్భంగా వారం రోజుల పాటు వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని ముఖ్యంగా రాత్రి పడుకునేముందు తప్పకుండ దంతాలను శుభ్రపరచు కోవాలని సూచించారు. డాక్టర్ దుర్గాదేవి మాట్లాడుతూ బ్రెష్ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. 100 మంది విభిన్న ప్రతిభావంతులకు, 50 మంది వృద్ధులకు దంతాలను పరీక్షించారు. అందరికి పేస్టులు, బ్రష్‌లు అందజేశారు. వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి, కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, సోషల్‌వర్కర్, యం.గీత, వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు,ఆశ కార్యకర్తలు రెడ్డికుమారి, మెర్సీగ్రేసి పాల్గొన్నారు.


దంత సమస్యలపై చిన్నారులకు సలహాలు ఇస్తున్న వైద్యులు

అభయారణ్యంలో అరుదైన జంతువులు


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి అటవీ శాఖ అధికారి నారాయణ

ప్రజాశక్తి -చిట్వేలు

మండల పరిధి లోని పెనుసిల లక్ష్మీ నరసింహ స్వామి అభయ అర ణ్యంలో ఇటీవల అమర్చిన 20 కెమెరాలకు అరుదైన జంతువులు కనిపించడం జరిగిందని ఇన్‌ఛార్జి మండల అటవీ శాఖ అధికారి ఆర్.నారాయణ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడవిలో సంచరిస్తున్న జంతువుల కదలికలను తెలుసుకునేందుకు 20 రోజుల క్రితం కెమెరాలను ఆమర్చడం జరిగిందని, అయితే అరుదుగా మల్లెమడుగు రస్తా దగ్గర , కూటాల మర్రికి వెళ్లే గంగమ్మ గుడి దగ్గర రెండు వేరువేరు చిరుతలు సంచరిస్తున్నట్లు కెమెరాలో చిత్రాలు లభించాయని అన్నారు. ఈ కెమెరాలను మరో 20 రోజులు వరకు అక్కడే ఉంచుతామని తెలిపారు. ఇలా గుర్తించడం ద్వారా ఈ కారిడార్‌లో ఉన్న పూర్తి జంతువుల కదలికలతో పాటు వాటి మనుగడకు కావలసిన చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది అన్నారు. సోమశిల రిజర్వాయర్ ఈ అటవీ ప్రాంతానికి అందుబాటులో ఉన్నందున జంతువుల మనుగడకు ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. అడవిలో అగ్ని ప్రమాదాలు ఈ సంవత్సరం ఇప్పటివరకు పెద్దగా జరగలేదని, ఒకవేళ జరిగితే తక్షణం చర్యలు తీసుకునేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇంత అరుదైన అటవీ ప్రాంతాల్లో అడవి జంతువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుని పైన ఉందన్నారు. సమావేశంలో ఎఫ్ఎస్ఒ శ్రీనివాసులు, సావిత్రి, కరిముల్లా ,సుబ్బయ్య పాల్గొన్నారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

మున్సిపల్ పరిధిలోని వడ్డీ చెల్లింపుదారులు వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒ 34 ప్రకారం వడ్డీ మాఫీ చేసిందన్నారు. మున్సిపల్ పరిధిలోని పన్నుచెల్లింపుదారులు ప్రతి ఆరు మాసాలకోసారి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. భవన విస్తీర్ణం, ప్రాంతాన్ని బట్టి పన్ను విధిస్తారని చెప్పారు. ఇందులో పన్ను సక్రమంగా చెల్లించేవారు, చెల్లించని వారున్నారన్నారు. 1993 నుండి ఇప్పటివరకు చెల్లించని వారి పన్ను అసలు మొత్తం 14.26 కోట్లు ఉందని చెప్పారు. ఇందుకు వడ్డీ రూ.10.72 పడుతుందని చెప్పారు. మొత్తం రూ.24. 98 కోట్లు ప్రొద్దుటూరు పురపాలక సంఘానికి బకాయి ఉందన్నారు. పన్ను చెల్లింపుదారునికి ఆర్థిక వెసులుబాటు కలిగించేందుకు వడ్డీ మాఫీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బకాయిల జాబితా నుంచి తమ పేర్లను తొలగించుకోవాలని ఆయన కోరారు. పన్నులు సకాలంలో చెల్లిస్తే మున్సిపల్ పరిధిలోని ప్రజలకు సేవలందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రూ.120 కోట్లతో మైలవరం జలాశయం నుంచి నీటిని సరఫరా చేయడంతో పాటు తాగునీటిని పరిష్కరించుకోవచ్చన్నారు. పట్టణ పరిధిలోని 40వార్డులలో రూ.90 కోట్లతో సిమెంట్ రోడ్లు వేశామన్నారు. ఇలా ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ప్రజలు చెల్లించే పన్ను సహకరిస్తుందన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి

యాదాటి సోదరులకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పసరు వైద్య సేవలకు గుర్తుగా పులివెందుల పట్టణానికి చెందిన యాదాటి సోదరులకు అరుదైన గౌరవం లభించింది. వీరి సేవలను గుర్తించి ఢిల్లీకి చెందిన మ్యాజిక్, ఆర్ట్ యూనివర్సిటీ వారి పర్యవేక్షణలో మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్ వారి ఆధ్వర్యంలో యాదాటి సోదరులైన రామ గంగాధర్ రెడ్డి యాదవ్, గ్రామ రెవెన్యూ అధికారి, యాదాటి వివేకానందరెడ్డి యాదవ్‌ను ఢిల్లీలో గురువారం సాంయత్రం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. కరోనా మొదటి సమయంలో అన్నదమ్ములిద్దరు లక్షలాది మందికి ఉచితంగా నాటు ఆకు పసరుతో వైద్యం అందించారు. వివిధ దీర్ఘకాలిక వ్యాధులకు నిత్యం ఆకు పసరు వైద్యం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా మహమ్మారి మన దేశానికి వచ్చినప్పుడు ఉచితంగా ప్రజలకు సేవ చేశామని చెప్పారు. అరుదైన గౌరవం దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు.

చిరుధాన్యాలు తిందాం.. ఆరోగ్యంగా ఉందాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

చిరుధాన్యాలు తిందాం.. చిరకాల ఆరోగ్యంగా ఉందాం అని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతికకళాశాల ప్రిన్సిపల్ సర్దార్ బేగ్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా పట్టణంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. చిరు ధాన్యాలు తిందాం - చిరకాలం ఆరోగ్యం గా ఉం దాం, సిరి ధాన్యాలే - చిరు ధాన్యాలు వంటి నినాదాలు చేశారు. కార్యక్ర మం లో డాక్టర్ ఏడుకొండలు, అరుణ, రాజశేఖర్, రామిరెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, నేత్రనిధి టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం బద్వేల్ వ్యవసాయ శాఖ ఎడిఎ నాగరాజు ఎఒ మ్యాగీతో కలిసి తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లోనిల్వ, అమ్మకం, ధరలు నమోదు చేసిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులను రైతులకు విక్రయించాలన్నారు. డిఏపిఎ ఎరు వులు ప్రయివేట్ దుకాణాలలో, సచివాలయాలలో అందుబాటులో ఉందన్నారు. కృత్రిమ కొరత కల్పించినా, అధిక ధరలకు విక్రయించినా లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కూడా దుకాణదారుల వద్ద రసీదులను తప్పక పొందాలన్నారు. డిఎపి స్థానంలో కృత్రిమ ఎరువులు వినియో గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా బోధనపై ప్రణాళికలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఉపాధ్యాయులు విద్యా బోధనపై ప్రణాళికలు సిద్ధం చేసుకొని విద్యార్థులకు పాఠాలు చెప్పాలని మానిటరింగ్ అధికారి చెరుకూరి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం వేంపల్లెలోని బాలికల ఉన్నత పాఠశాలలో లిప్ కార్యక్రమంపై మానిటరింగ్ అధికారి చెరుకూరి శ్రీనివాసులు తనిఖీ చేశారు. 6,7,8 తరగతులకు చెందిన లెసన్ ప్లానింగ్, కే స్టడీ, ప్రాక్టీసు పీరియడ్ వాటిపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఉపాధ్యాయుడూ లిప్‌పై తప్పనిసరిగా దృష్టి పెట్టాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులు చదువులో ముందు వరుసలో ఉండే విధంగా చేయడమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దిశగా ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పులివెందుల రూరల్ : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఆర్టీసీ డిఎం ఉమామహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పులివెందుల ఆర్టీసీ నూతన డిపోలో డిఎం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ షరీఫ్ సొంత నిధులతో వివిధ రకాల మొక్కలను తీసుకురావడం సంతోషకరమన్నారు. మొక్కలు నాటడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. వాటి పరిరక్షణ కూడా మనం చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కులాయప్ప, సూర్యనారాయణ, గోపాల్‌రెడ్డి, కులాయప్ప, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు


ప్రొద్దుటూరు : ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్/ ప్రొద్దుటూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మెలోకి వెళ్లేందుకు వెనుకాడమని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. శుక్రవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కల్టెరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ అలవెన్సు కోసం సమ్మె చేస్తే ఇస్తామని చెప్పిన ప్రభుత్వం విస్మరించడం శోచనీయమన్నారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ వేతనంలో కలిపి ఇస్తోందని, ఇంజినీరింగ్ కార్మికులకు ఇవ్వకపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. కార్మికులకు న్యాయం చేయని పక్షంలో సమ్మెలోకు వెళ్లేందుకు వెనుకాడమని హెచ్చరించారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన పనిముట్లు, రెయిన్‌కోట్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. జిఒ నంబరు 7 ప్రకారం కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని చెప్పారు.

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) నాయకులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష కార్యదర్శులు చంటి, సాల్మన్ మాట్లాడుతూ ఐదు రోజుల సమ్మెకాలపు ఒప్పందాల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. నేటి ధరలకు అనుగుణంగా కనీసం వేతనం రూ.26 వేలు మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఏపిఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. స్థానిక 1వ డివిజన్ నుంచి నలుగురు కార్మికులను 4వ డివిజన్‌కు పంపించారని వారిని యధావిధిగా 1వ డివిజన్‌లోనే ఉంచాలని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన చెత్త ఆటోల నుండి మహిళాకార్మికులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఆదివారం పూర్తి సెలవు దినం ఇవ్వాలన్నారు. అనంతరం మున్సిపల్ సహాయ కమిషనర్ రంగస్వామికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్మికులు గుర్రమ్మ, రమాదేవి, రవణమ్మ, నీతమ్మ, మోహన్‌జాకోబ్, శాంతి, ప్రమీలమ్మ, నరసమ్మ, సురేష్, అన్నపూర్ణ పాల్గొన్నారు.


చమర్తి జగన్మోహన్‌రాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆలయాన్ని సందర్శించిన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో గంగమ్మతల్లి అమ్మవారి దేవాలయాన్ని శుక్రవారం టిడిపినేత చమర్తి జగన్మోహన్‌రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు కొమ్మి సాంబశివ నాయుడు ఆహ్వానం మేరకు ఆలయాన్ని సందర్శించానని చెప్పారు. అనంతరం మాజీ ఎంపిపి పొరా సుబ్బానాయుడును మర్యాదపూర్వకంగా కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు శాలువాతో చమర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు విజయ్ కుమార్ నాయుడు, రామ్ నారాయణ, పైడి సుధాకర్, పైడి మురళి, దేవినేని రమణయ్య నాయుడు, దేవినేని మనోజ్, ముత్తినేని శాంతయ్య నాయుడు, శకినాల రమేష్‌బాబు, బాలాజీ, మండల సీనియర్ నాయకులు వెంకట సుబ్బరాజు, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, సూర్యనారాయణ రాజు, నాగేంద్ర తులసి, వెంకటేష్ యాదవ్, గురు నాయుడు, శివకుమార్ రాజు, బుడెన్ సాహెబ్, రాజేష్ వర్మ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పారిశుధ్యం పైన ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోందని ఊటుకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి జె.బాలకుమార్ తెలిపారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాలలో జెసిబితో కాలువలలోని పూడికలు తీయించారు. మురికి, చెత్తను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో రాజీ పడేది లేదని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పంచాయతీ పరిధిలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సహాయకులు వెంకటయ్య పాల్గొన్నారు.


మురికిని తొలగిస్తున్న జెసిబి

నేడు వారపు సంత వేలం

గాలివీడు : స్థానిక పంచాయతీ పరిధిలో ఉన్న బస్టాండ్ గేటు, కూరగాయల సంత, గొర్ల సంతకు శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ లక్ష్మి దేవమ్మ, పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమానికి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ హాజరవుతారని పేర్కొన్నారు. ముందుగానే డిపాజిట్లు చెల్లించిన వారు వేలంలో పాల్గొనవచ్చు అని తెలిపారు.


చాక్లెట్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్

ది చాక్లెట్ రూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ పరిధిలోని శేషసాయి కళ్యాణ మండపం ఎదురుగా నూతనంగా ది చాక్లెట్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి మదనపల్లి నియోజకవర్గం పరిశీలకులు హబీబ్ ఖాన్, మున్సిపల్ చైర్ పర్సన్ మనూజారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కె.మనోజ్ కుమార్ రెడ్డి, గురుప్రసాద్ రెడ్డిలు ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ హోటల్ మేనేజ్ మెంట్ రంగంపై ఉన్న మమకారంతో ది చాక్లెట్ రూమ్ ప్రారంభించడం సంతోషకరమన్నారు. ది చాక్లెట్ రూమ్ సరికొత్త హంగులతో, చాలా ఆహ్లాదకరంగా ఉందని, ఇక్కడ వంటకాలు ఎంతో రుచిగా ఉన్నాయని కితాబునిచ్చారు. వ్యాపారంలో వీరు అద్భుత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ బాషా సహాయ, సహకారాలు వీరికి ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.మనోజ్ కుమార్ రెడ్డి, గురు ప్రసాద్ రెడ్డి, సూపర్ వైజర్ లక్ష్మి, కౌన్సిలర్లు ప్రసాద్ బాబు, ఎల్ఐసి సుధాకర్ పాల్గొన్నారు.

వివాద స్థలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-చిట్వేలు

గత కొద్ది సంవత్సరాలుగా వివాదాస్పదంగా ఉన్న సయ్యద్ బురందీన్ దర్గా స్థలాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక తహశీల్దార్ మురళీకృష్ణతో కలిసి దర్గా స్థలాన్ని పరిశీలించి ఇరువురు వ్యక్తులతో చర్చించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ స్థలం విషయంలో ఇరువురితో విచారణ జరుగుతుందని తెలిపారు. వారి సమస్యను సామరస్యంగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శేషంరాజు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అహ్మద్ ఖాన్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములకు గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ద్విచక్రవాహన ప్రమాదంలో అన్నదమ్ములు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. అగ్రహారం పంచాయతీ బండమీద పల్లెకు చెందిన గుర్రప్ప కుమారులు గురునాథ్(29), జగదీష్(28), గణేష్(26) ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంలో వాల్మీకిపురం మండలం, చింతపర్తికి వ్యక్తిగత పనులపై వెళ్లారు. పని ముగించుకొని వస్తుండగా నిమ్మనపల్లి-చింతపర్తి మార్గంలోని ఆరిపిరెడ్డిగారిపల్లి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, స్థానికులు గమనించి మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముగ్గురిని పరీక్షించిన వైద్యులు గణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.